# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-12-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **విద్యుత్ శాఖ సహా పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **రాష్ట్రంలో ఈరోజు, రేపు పర్యటించనున్న కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి జుయల్ ఓరమ్.**

3. **ఢిల్లీలో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమైన రాష్ట్ర మంత్రులు వి.అనిత, నారా లోకేష్.**

4. **తిరుపతి కేంద్రంగా ఆధ్యాత్మిక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్న రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్.**

5. **అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో విద్యుత్ శాఖపై సంబంధిత అధికారులతో విద్యుత్ సరఫరా, పునరుత్పాదక ఇంధన వనరులు, విద్యుత్ పంపిణీ పథకాలు, విద్యుత్ సమస్యలు, ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం గనుల శాఖపై సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే సాయంత్రం రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు..

-------------------------

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరమ్ రాష్ట్రంలో ఈరోజు, రేపు పర్యటిస్తారని గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఈ రోజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ నుంచి సాయంత్రం కేంద్ర మంత్రి విజయవాడ చేరుకుంటారని అక్కడే బస చేస్తారని చెప్పారు. రేపు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఒక ప్రయివేటు విశ్వవిద్యాలయంలో జరిగే ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు- ఇ.ఎం.ఆర్.ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సాంస్కృతిక, సాహిత్య కళా ఉత్సవ్ -ఉద్భవ్ 2025లో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

-------------------------

ఢిల్లీలో రాష్ట్ర హోంమంత్రి వి.అనిత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ మధ్యాహ్నం కేంద్ర వ్యవసాయశాఖమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మొంథా తుఫాను కారణంగా జరిగిన నష్టంపై వివరించనున్నారు. అలాగే పత్తి, మొక్కజొన్న, అరటి ధరలు తగ్గడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి వివరించి ఆదుకోవాలని కోరనున్నారు.

---------------------------

తిరుపతి కేంద్రంగా ఆధ్యాత్మిక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. దర్శనం అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతాన్ని తిరుపతి కేంద్రంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. విశాఖపట్నం, సెంట్రల్, రాయలసీమ మూడు జోన్‌లుగా రాష్ట్రాభివృద్ధి జరుగుతోందన్నారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సు ద్వారా పెట్టుబడులతో ఉపాధి కల్పించేలా ఒప్పందాలు కుదుర్చుకున్నామని మంత్రి వివరిస్తూ,

వాయిస్ 35 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 6 కోట్ల రూపాయలకు పైగా ఎనిమిది చెక్కులను లబ్ధిదారులకు మంత్రి ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని పొందవచ్చని మంత్రి తెలిపారు.

---------------------------

అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం తాళ్లవలసలో అతిసార కేసులు నమోదైన నేపథ్యంలో ఆ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంత్రి ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాధికి గల కారణాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు అనంతరం మంత్రి మాట్లాడుతూ, అతిసార వ్యాధి నియంత్రణలోనే ఉందని చెప్పారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 8 మంది ఆరోగ్యం నిలకడగానే ఉందని, గ్రామంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

---------------------------

స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకం కాదని, ప్రజలు భయాందోళన చెందవద్దని ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ

అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఒంగోలులో ఆయన ఈరోజు మాట్లాడుతూ, లార్వల్ మైట్స్ అనే పురుగు ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందని కేవలం జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలతో ఉంటాయని తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాల ద్వారా ఈ వ్యాధిని నియంత్రించవచ్చని ఆయన తెలియజేస్తూ

వాయిస్ .. 30 సెకన్లు

-----------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు తూర్పు గోదావరి జిల్లాలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్లలో జరిగే 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రంలో జరిగే సదస్సుకు హాజరవుతారు. ప్రస్తుత రబీ, 2026-27 ఖరీఫ్, రబీ పంటకాలాలకు సంబంధించి గ్రామ స్థాల విలువ జోడింపు, కార్యాచరణ ప్రణాళికలపై చర్చిస్తారు. రేపు రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 451 రైతు సేవా కేంద్రాల్లో కరపత్రాల పంపిణీ, రైతు సదస్సులు నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు.

-----------------------------

నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల మీదుగా ఉన్న వాయుగుండం దక్షిణ నైరుతి దిశగా కదిలి అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

-----------------------------

విజయవాడ నుంచి అహ్మదాబాద్, వారణాసి, పుణె, కొచ్చి, గోవాలకు విమాన సర్వీసులు ప్రాంభించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడుని రాష్ట్ర పార్లమెంట్ సభ్యులు కోరారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, అమలాపురం ఎంపీ జీఎం హరీష్ బాలయోగి పార్లమెంటు భవన్‌లో కేంద్రమంత్రిని కలిసి నిన్న వినతిపత్రం సమర్పించారు. ఈ అంశాలపై సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటానని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని ఎంపీలు తెలిపారు.

-----------------------------

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లను రాయితీతో అందిస్తోందని విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం, మైలవరం గ్రామ పంచాయితీ పరిధిలో రైతులకు వ్యవసాయ యంత్రాలను మంత్రి నిన్న అందజేశారు.

=====================